ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

తమిళనాడు
TAMILNADU
ఆదివారం 20 జూలై 2025

రేపు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శ్రీవాస్తవ ప్రమాణం



పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ (ఎంఎం శ్రీవాస్తవ) ఈ నెల 21న పదవీ ప్రమాణం చేయనున్నారు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ కేఆర్ శ్రీరాం రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేస్తూ ఇటీవల రాష్ట్రపతి భవన్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. స్థానిక గిండిలోని రాజ్‌భవన్‌లో సోమవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎన్ రవి, హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా ఎంఎం శ్రీవాస్తవచే పదవీ ప్రమాణం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు హాజరు కానున్నారు.

చల్లబడిన రాజధాని

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురవడంతో చెన్నై చల్లబడింది. కేకేనగర్, వడపళని, రాయపురం, విరుగంబాక్కం, నుంగంబాక్కం, కోడంబాక్కం, ఎగ్మూర్, వలసరవాక్కం, మైలాపూర్, మందవెల్లి, గోపాలపురం, చేపాక్కం సహా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నగరంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు వర్షం కురిసింది. మళ్లీ సాయంత్రం వాన కురవడంతో నగర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, చెన్నైతో పాటు తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు, నీలగిరి, తిరుప్పూర్, తేని, దిండుగల్, తెన్‌కాశి, విరుదునగర్, తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి, కోయంబత్తూర్ తదితర ప్రాంతాల్లో ఉరుములు, పిడుగులతో మోస్తరు వర్షం కురిసిందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. నెలల తరువాత నగరం చల్లబడడంతో ఉక్కపోతనుంచి నగరవాసులు ఉపశమనం పొందారు.

సీఎం కాన్వాయ్‌లో మరో రెండు బుల్లెట్‌ప్రూఫ్ కార్లు



చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సీఎం స్టాలిన్ కాన్వాయ్‌లో మరో రెండు కొత్త రకం బుల్లెట్‌ప్రూఫ్ కార్లను భద్రతా విభాగం అధికారులు చేర్చారు. దీవతో స్టాలిన్ భద్రతా విభాగంలో బుల్లెట్ ప్రూఫ్ కార్ల సంఖ్య 9కి పెరిగింది. ముఖ్యమంత్రి వాహనాల వరుసలో బుల్లెట్ ప్రూఫ్ కార్లకు మూడు నిఘా కెమెరాలు, సెల్‌ఫోన్ల జామర్లుంటాయి. అత్యంత వేగంగా నడిచే ఈ కార్లు చిన్న ప్రమాదాలకు గురైన వెంటనే ఇంధన సరఫరా ఆగిపోయి వాహనాన్ని నడస్ బ్రేక్ వేసినట్లు నిలిచిపోతాయి. గతంలో స్టాలిన్ కాన్వాయ్‌లోకి బుల్లెట్ ప్రూఫ్ కార్లను హైదరాబాద్ నుంచి తెప్పించేవారు. ప్రస్తుతం నగర శివారు ప్రాంతంలోని ఆవడిలో ప్రఖ్యాతిగడించిన కార్ల తయారీ సంస్థ రూపొందించిన రెండు బుల్లెట్‌ప్రూఫ్ కార్లను కొనుగోలు చేశారు. ఈ కార్లపై ఏకే-47 తుపాకీతో కాల్పులు జరిపినా ఎలాంటి హాని జరగదు. బాంబులు విసిరినా చెక్కుచెదరదు. ఈ కార్ల టైర్లకు పంక్చర్ అయినా 75 కిలోమీటర్ల దూరం వరకు సాఫీగా నడుస్తాయి. ఈ కొత్త రకం బుల్లెట్ ప్రూఫ్ కార్లను ఉత్తరాఖండ్ పోలీసులకు, పుదుచ్చేరి పోలీసు ఉన్నతాధికారులకు కూడా ఆవడి ప్రైవేటు కార్ల తయారీ సంస్థ విక్రయించింది. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఈ కొత్త రకం కారులో ప్రయాణించనున్నారని భద్రతా విభాగం అధికారులు తెలిపారు.



ఎంకే ముత్తు (ఫైల్ ఫోటో)

సీఎం సోదరుడు

ఎంకే ముత్తు కన్నుమూత

● పలువురు నేతల నివాళి



ముత్తు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న స్టాలిన్

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ సోదరుడు, మాజీ సీఎం, దివంగత కరుణానిధి పెద్ద కుమారుడు ఎంకే ముత్తు కన్నుమూశారు. ఆయన వయస్సు 77 సంవత్సరాలు. కొంతకాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కరుణానిధి, ఆయన మొదటి భార్య పద్మావతికి 1948లో ఎంకే ముత్తు జన్మించారు. ముత్తు జన్మించిన కొద్ది గంటలకే తల్లి పద్మావతి మృతి చెందారు. దీంతో ఆయన తన అమ్మమ్మ వద్దే పెరిగి పెద్దయ్యారు. యుక్త వయస్సులో తండ్రి కరుణానిధితో కలిసి డీఎంకే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. పార్టీ సిద్ధాంతాలను తెలిపే పాటలను సభల్లో పాడేవారు. ఎంజీఆర్, రాజకీయాల్లో, చిత్రసీమలో ఓ వెలుగు వెలుగుతున్నప్పుడు 1970 దశకాలలో ఆయనపై పోటీగా కరుణానిధి తనయుడు ముత్తును సినీరంగంలోకి దింపారు. చూడటానికి అచ్చుగుద్దినట్లు ఎంజీఆర్‌లాగే మేకప్ వేసుకుని ఆయన నడక, బాణీని పుణికిపుచ్చుకుని మరీ ఎంకే ముత్తు సినిమాల్లో నటించారు. 'పూక్కారి', 'పిళ్లయో పిళ్లై', 'సమయల్‌కారన్', 'అనయావిళక్కు', 'ఇంగేయుమ్ మనిదర్‌గళ్' తదితర సినిమాల్లోనూ నటించారు. కానీ ఈ సినిమాలన్నీ ఆశించిన రీతిలో విజయం సాధించలేకపోయాయి. అయితే కొన్ని చిత్రాల్లో ఆయన గానం చేసిన 'కాదలిన్ పొన్ వీధియిల్', 'ఎందన్ మనదిల్ కుడి ఇరుక్కుమ్ నాగూర్ అండవా' వంటి పాటలు తమిళ ప్రేక్షకుల మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాయి. ఎంకే ముత్తుకు ముఖ్యమంత్రి తనయుడనే పలుకుబడి మెండుగా ఉన్నప్పటికీ అటు రాజకీయాల్లోనూ, ఇటు సినిమాల్లోనూ రాణించలేకపోయారు. ఓసారి ఎంజీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తండ్రి కరుణానిధిపై అలిగిన ముత్తు.. రామావరం గార్డెన్‌లో ఉన్న ఎంజీఆర్ వద్దకు వెళ్లాడని, ఆయన ఇరువురి మధ్య రాజీ కుదిర్చారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఎంకే ముత్తు తన బాణీలో తనలాగే మేకప్ వేసుకున్నా ఎంజీఆర్ వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా ఆయన హీరోగా నటించిన 'పిళ్ళయో పిళ్లై' సినిమా షూటింగ్‌ను క్లాప్‌కొట్టి తన పెద్ద మనస్సును చాటుకున్నారు. అంతేకాకుండా ఎంకే ముత్తుకు ఎంజీఆర్ అత్యంత విలువైన రోలెక్స్ చేతి గడియారాన్ని కానుకను ఇచ్చారు. కరుణానిధి 13 యేళ్లపాటు ప్రధాన ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు తనయుడు ఎంకే ముత్తు బాగోగులు పట్టించుకోలేదని ఆరోపణలు వెలువడ్డాయి. ప్రతినెలా కొంత నగదును స్నేహితుల ద్వారా ముత్తుకు పంపేవారు. అదే సమయంలో ముత్తు పేదరికంలో కొట్టుమిట్టాడారు. ముత్తు దైన్యస్థితి గురించి తెలుసుకున్న అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత ఆయనకు రూ.5లక్షల ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు. ఎంకే ముత్తుకు భార్య శివకామసుందరి, కుమారుడు అరివునిధి, కుమార్తె తేన్‌మొళి ఉన్నారు. 2008లో 'మాట్టుతావని' చిత్రంలో దేవా సంగీత దర్శకత్వంలో ఎంకే ముత్తు ఓ పాట పాడారు. 2018లో కరుణానిధి మృతి చెందినప్పుడు ముత్తు ఆయన అంత్యక్రియల్లో పాల్గొనలేదు. మరుసటి రోజు తండ్రి సమాధి వద్ద ఇద్దరు సహాయకులను వెంటబెట్టుకుని నడవలేని స్థితిలో వెళ్లి నివాళులర్పించారు. 2023లో ముత్తు తీవ్ర అనారోగ్యానికి గురై కొద్ది నెలలపాటు ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. ఈ నేపథ్యంలో వృద్ధాప్య సమస్యలకు తోడు తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చి శనివారం ఉదయం కన్నుమూశారు. నగర శివారు ప్రాంతమైన ఈంజంబాక్కంలోని నివాసగృహంలో ఎంకే ముత్తు భౌతికకాయాన్ని ప్రజల సందర్శన కోసం గంటసేపు ఉంచారు. ఈ సమాచారం అందగానే స్టాలిన్ ఈంజంబాక్కంకు వెళ్లి సోదరుడి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. ఆ తర్వాత స్టాలిన్ ఆదేశాల మేరకు ముత్తు భౌతికకాయాన్ని గోపాలపురంలోని కరుణానిధి నివాసగృహానికి తరలించారు. దీంతో స్టాలిన్ కుటుంబ సభ్యులు, మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు గోపాలపురానికి వెళ్ళి ముత్తు భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. మంత్రులు దురైమురుగన్, పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, మేయర్ ఆర్ ప్రియా, డీపీఐ నేత తిరుమావళవన్, నటుడు సత్యరాజ్, సినీ గేయ రచయిత వైరముత్తు తదితరులు ముత్తు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్టాలిన్, ఈపీఎస్ సంతాపం...

ఎంకే ముత్తు మృతిపట్ల ఆయన సోదరుడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఎండీఎంకే నేత వైగో, పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి రాందాస్, టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై తదితరులు సంతాపం వ్యక్తం చేస్తూ ప్రకటనలు వెలువరించారు. స్టాలిన్ తన ప్రకటనలో తన సోదరుడు ఎంకే ముత్తు మృతి వార్త తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని, కరుణానిధి తన తండ్రిపేరైన ముత్తువేలర్ పేరే తన సోదరుడికి పెట్టారని తెలిపారు. యుక్తవయస్సులో ముత్తు పార్టీ అభివృద్ధి కోసం విశిష్ట సేవలందించారని తెలిపారు. చిత్రసీమలోనూ ముత్తు మంచి నటుడిగా, గాయకుడిగా పేరుతెచ్చుకున్నారని, ఆయన పాడిన పాటలు తమిళ ప్రేక్షకుల మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాయని చెప్పారు. 'నల్ల మనదిల్ కుడియిరుక్కుం నాగూర్ ఆండవా', 'సొందక్కారుంగ ఎనక్కు రొంబ పేరుంగ' అనే పాటలు తమిళ ప్రేక్షకులు మరువలేరని తెలిపారు. ముత్తు తన ఎదుగుదలను చూసి సంతోషపడేవారని, తామిరువురమూ ఎప్పుడు కలుసుకున్నా పాత సంగతులు గురించి మాట్లాడుకునేవారమని చెప్పారు. ముత్తు మృతి తమ కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సంతాప సందేశం వెలువరిస్తూ మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పెద్ద కుమారుడు ఎంకే ముత్తు తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు తెలుసుకుని తాను తీవ్రంగా బాధపడ్డానని, ఆయన మృతితో శోకతప్తులైన కుటుంబీకులకు తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానని తెలిపారు.



ముత్తు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న అళగిరి



ఎడప్పాడికి జ్ఞాపికను బహూకరిస్తున్న వేలాంకన్ని చర్చి నిర్వాహకులు

అధికారంలోకి వస్తే జాలర్ల సమస్యలకు పరిష్కారం

● నాగపట్టినం జిల్లాలో ఎడప్పాడి

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన వెంటనే జాలర్ల సమస్యలు పరిష్కరిస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డెల్టా జిల్లాల్లో 'మక్కలై కాప్పోం... తమిళగత్తై మీడ్పోం' నినాదంతో మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత పళనిస్వామి ప్రచారం చేపడుతున్నారు. పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం నాగపట్టినం జిల్లాకు చేరుకున్న ఈపీఎస్‌కు జిల్లా సరిహద్దుల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తొలి రోజు కీళ్‌వేలూరులో పర్యటించారు. శనివారం ఉదయం వేలాంకన్ని సెయింట్ ఆరోగ్య మాత చర్చిలో కొవ్వొత్తి వెలిగించి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం సొరుదూర్ గ్రామానికి వెళ్లిన ఆయన, జాలర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో జాలర్లు, శ్రీలంక నావికాదళం, సముద్ర దొంగల దాడుల నుంచి తమను రక్షించాలని, ఏళ్లుగా నివసిస్తున్న తమకు పట్టాలు అందించాలని ఈపీఎస్‌కు విన్నవించుకున్నారు. అనంతరం నంబియార్‌నగర్ ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లిన పళనిస్వామి, అక్కడి జాలర్లు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పళనిస్వామి మాట్లాడుతూ... అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో నంబియార్ నగర్ ఫిషింగ్ హార్బర్‌కు ప్రభుత్వ వాటాగా రూ.24 కోట్లు, ప్రజల భాగస్వామ్యం రూ.11 కోట్లు అని మొత్తం రూ.35 కోట్లతో హార్బర్ నిర్మించామన్నారు. పనులు పూర్తయిన తరుణంలో, ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ హార్బర్ ప్రారంభించారన్నారు. అన్నాడీఎంకే అధికారం చేపట్టిన వెంటనే, రాష్ట్రంలో కన్నియాకుమారి వరకు ఉన్న సముద్రతీర జాలర్ల గ్రామాల్లో రక్షణ గోడ, చిన్న ఓడరేవులు, చేపల వేట నిషేధకాలంలో అందిస్తున్న భత్యం పెంపు తదితరాలు చేపడతామని పళనిస్వామి హామీ ఇచ్చారు. అన్నాడీఎంకే ప్రభుత్వంలో 'గజ' తుఫానుతో నష్టపోయిన జాలర్లకు రూ.1.50 లక్షల రాయితీ ఫైబర్ పడవలు అందజేశామని, 6 వేల ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి, 1,300 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశామని, వాటిని కూడా డీఎంకే ప్రభుత్వం అందించలేదని ఆరోపించారు.





అతిథులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న డబ్ల్యూటీఎఫ్ నిర్వాహకులు - విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

తెలుగువారి ఆత్మ గౌరవం ఎన్టీఆర్

● డబ్ల్యూటీఎఫ్ సభలో వక్తలు

ప్యారీస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో చక్రం తిప్పి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉభయ తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తెలుగువారి ఆత్మగౌరవం అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక టి.నగర్‌లోని ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 102వ జయంతిని 'విశ్వవిఖ్యాతుని మధుర స్మృతులు' పేరిట శనివారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. అరుణా శ్రీనాథ్ ప్రార్థన గీతంతో ప్రారంభమైన ఈ వేడుకల్లో డబ్ల్యూటీఎఫ్ అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ తన సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సభికులకు వినిపించారు. ప్రధాన కార్యదర్శి కె.శ్రీలక్ష్మీ మోహన్‌రావు స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్యఅతిథిగా సినీ నిర్మాత, ఎన్టీఆర్ సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ వైస్ చైర్మన్ కాట్రగడ్డ ప్రసాద్, ప్రత్యేక అతిథిగా మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు, గౌరవ అతిథిగా జనని సాంఘిక సాంస్కృతిక సమితి ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య విచ్చేసి ఎన్టీఆర్ జీవిత విశేషాల గురించి ప్రసంగించారు. కాట్రగడ్డ ప్రసాద్ మాట్లాడుతూ... 2023వ సంవత్సరం ఎన్టీఆర్ శతవార్షిక జయంతి వేడుకలను విజయవాడలోని ఓ ప్రైవేటు హాలులో జరుపుకునేందుకు అప్పటి ప్రభుత్వం అనుమతించలేదని, అందువల్ల ఎమ్మెల్యే బోడే ప్రసాద్ గ్రౌండులో బ్రహ్మాండంగా నిర్వహించిన ఆ వేడుకల్లో వేలసంఖ్యలో అభిమానులు పాల్గొని ఎన్టీఆర్‌ను స్మరించుకున్నారన్నారు. ఆ మహాపురుషుడి శత జయంతి ఉత్సవాలను ప్రపంచ దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రుల మధ్య విజయవంతంగా జరుపుకున్నామన్నారు. ఎన్టీఆర్ నటించిన 302 సినిమాల్లోని 302 పాటలతో త్వరలో 24 గంటల కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు కోసం నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. విస్తాలి శంకరరావు మాట్లాడుతూ... ఎన్టీఆర్ దైవాంశ సంభూతుడని, తరాలు మారినా, ప్రపంచం మెచ్చిన ఆ ధ్రువతారను స్మరించుకుంటూ ఉండాలని ఎన్టీఆర్ అభిమానులకు సభా ముఖంగా పిలుపునిచ్చారు. గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ... 1949లో తన తొలిచిత్రం 'మన దేశం'తో చిత్రపరిశ్రమలో అడుగుపెట్టిన ఎన్టీఆర్ 1993 వరకు ఎన్నో మహత్తర పాత్రలు పోషించి అలరించిన కళామతల్లి ముద్దుబిడ్డ అని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా టి.నగర్ కేసరి మహోన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎన్టీఆర్ నటించి ప్రజాదరణ పొందిన 'దాన వీర శూర కర్ణ' 'పాండవ విజయం' తదితర చిత్రాల్లోని సంభాషణలతో అభినయించి సభను రంజింపజేశారు. ఆస్కా మాజీ అధ్యక్షుడు, ఆర్కిటెక్చర్ మాదాల ఆదిశేషయ్య తన 83వ జన్మదినం సందర్భంగా ఈ సభలో కేక్ కట్‌చేసి విద్యార్థులు, డబ్ల్యూటీఎఫ్ నిర్వాహకుల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ముందుగా ఇటీవల మరణించిన ప్రముఖ నటులు కోటా శ్రీనివాసరావు, బి.సరోజాదేవి, అహ్మదాబాద్ విమానప్రమాదంలో మృతిచెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి అంజలి ఘటించారు. అతిథులు, విద్యార్థులకు జ్ఞాపికలు బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలలో తెలుగు ప్రముఖులు జేఎం నాయుడు, కేఎస్ సురేష్‌బాబు, ఆస్కా కమిటీ సభ్యులు మన్నూరు చలపతి, చారుగండ్ల వెంకటేశ్వరరావు, గోటేటి వెంకటేశ్వరరావు, పద్మజ, రుక్మిణిదేవి తదితరులు పాల్గొన్నారు. కోశాధికారి మాదాల వెంకట సుబ్బారావు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

నామక్కల్ కార్పొరేషన్‌కు కేంద్రప్రభుత్వ అవార్డు

ప్యారీస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశుభ్రత నగరాల్లో ప్రథమస్థానంలో నిలిచిన నామక్కల్ కార్పొరేషన్‌ను అభినందించిన కేంద్రప్రభుత్వం 'స్వచ్ఛ సర్వేక్షణ్ - 2024 అవార్డు ప్రదానం చేసింది. కేంద్రప్రభుత్వ గృహ వసతి, నగరాభివృద్ధి మంత్రిత్వశాఖ ద్వారా దేశవ్యాప్తంగా వున్న నగరాల్లో 'స్వచ్ఛ భారత్' పేరిట ప్రతిఏటా పరిశుభ్రత పాటిస్తున్న నగరాలపై సర్వే నిర్వహిస్తున్నారు. ఈ రీతిలో 2024లో బయోవ్యర్థాల పథకం కింద సేకరించిన వివరాలను పరిశీలించి, మార్కులు కేటాయించి, అవార్డుకు అర్హత ఉన్న నగరాలను ఎంపిక చేసే పనులను ఇఫ్సోర్స్ అనే సంస్థకు కేంద్రం అప్పగించింది. ఆ సంస్థ గత మార్చి 18 నుంచి 25వ తేదీ వరకు నామక్కల్ కార్పొరేషన్‌లో ఉన్న 39 వార్డులను పరిశీలించింది. ఇందులో మలైకోట, ఆంజనేయస్వామి ఆలయం, గడియార స్తంభం, నగరంలోని వీధులు, ఇంటింటికి చెత్త సేకరణ, తడిచెత్త, పొడిచెత్తగా విభజించడం తదితరాలను పరిశీలించింది. అంతేకాకుండా చెత్త నుంచి సేకరించే వ్యర్థాలతో ఎరువు తయారు చేయడం, వారసంత, డంపింగ్ యార్డు, బస్‌స్టేషన్, దుకాణాలు, వాణిజ్య కాంప్లెక్సులను పరిశీలించి, పరిశుభ్రతలో నామక్కల్ కార్పొరేషన్ ప్రథమస్థానంలో ఉందని కేంద్రప్రభుత్వానికి నివేదికను అందజేసింది. ఈ ప్రతిపాదన మేరకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు నామక్కల్ కార్పొరేషన్‌ను ఎంపిక చేసినట్లు ఈ నెల 14న కేంద్రప్రభుత్వం ప్రకటించింది. గురువారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గృహ వసతి గృహ వసతి, నగరాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్ లాల్ కటారియా చేతుల మీదుగా నామక్కల్ కార్పొరేషన్ మేయర్ కళానిధి, డిప్యూటీ మేయర్ భూపతి, నగర అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనామికలు అవార్డు స్వీకరించారు. కాగా, 20యేళ్ల క్రితం కూడా పరిశుభ్రత కార్పొరేషన్‌గా కేంద్రప్రభుత్వ అవార్డును నామక్కల్ కార్పొరేషన్ సొంతం చేసుకోవడం గమనార్హం.


అవార్డు స్వీకరిస్తున్న నామక్కల్ మేయర్ కళానిధి, డిప్యూటీ మేయర్ భూపతి తదితరులు

శుభ్రమైన నగరాల్లో 38వ స్థానంలో చెన్నై కార్పొరేషన్

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో శుభ్రమైన నగరాల్లో చెన్నై కార్పొరేషన్ 38వ స్థానంలో నిలిచింది. కేంద్ర గృహ వసతి, నగర అభివృద్ధి మంత్రిత్వ శాఖ యేటా 'స్వచ్ఛ భారత్' పథకం అమలుచేస్తున్న నగరాల జాబితా విడుదల చేస్తోంది. 10 లక్షలకు పైబడిన జనాభా కలిగిన కార్పొరేషన్ల జాబితాలో చెన్నై కార్పొరేషన్ 38వ స్థానంలో నిలిచింది. నగరంలో చెత్త సేకరణ, సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా విభజించడం తదితరాల ఆధారంగా చెన్నై కార్పొరేషన్ 6,822 పాయింట్లు సాధించింది. అలాగే, రాష్ట్రంలోని కోయంబత్తూర్ కార్పొరేషన్ 28వ స్థానం, మదురై 40, తిరుచ్చి కార్పొరేషన్ 49వ స్థానంలో నిలిచినట్లు అధికారులు తెలిపారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా అంబత్తూర్ సిడ్కో పరిధిలోని పోర్‌పెక్ట్ వీధి, ఎంఎఎల్ హెచ్‌టీ సర్వీస్, గోద్రేజ్ హెచ్‌టీ సర్వీస్, అమెగా హెచ్‌టీ సర్వీస్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు

ఆస్తి పన్ను సందేహాల నివృత్తికి ప్రత్యేక నెంబరు

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లింపులో వినియోగదారుల సందేహాలు నివృత్తి చేసేలా ప్రత్యేక నెంబరు పరిచయం చేశారు. గృహ, కర్మాగారాల యజమానులు సులభంగా ఆస్తి పన్ను చెల్లించేలా 2013లో https://vptax.tnrd.tn.gov.inను పరిచయం చేశారు. అలాగే, వినియోగదారుల వద్దకే వెళ్లి ఆస్తి పన్ను వసూలుకు పీఓఎస్ పరికరం అందుబాటులో ఉంది. ఆ ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి అర్థవార్షికంలో ఇప్పటివరకు 19.33లక్షల మంది యజమానులనుంచి రూ.103.92కోట్లు వసూలయ్యాయి. ఈనేపథ్యంలో, ఆస్తి ప న్ను చెల్లింపులోకలిగే సందేహాలను నివృత్తి చేసుకునేలా నెం.9884924299ను పరిచయం చేశారు. ఆన్‌లైన్‌లో పన్ను చెల్లింపు, పన్ను వివరాలు ఈ నెంబరు సంప్రదించి తెలుసుకోవచ్చు.

'ముఖ్యమంత్రి ట్రోఫీ' పోటీలకు పేర్ల నమోదు

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది 'ముఖ్యమంత్రి ట్రోఫీ' పోటీలకు క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చు. 'ముఖ్యమంత్రి ట్రోఫీ' జిల్లా, మండల స్థాయి పోటీలు ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 12వ తేది వరకు నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలో పాఠశాల, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు, దివ్యాంగులు, ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు.. ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో 27 రకాల పోటీలు, మండల స్థాయిలో 7 పోటీలు, రాష్ట్రస్థాయిలో 37 రకాల పోటీలు నిర్వహించనున్నారు. cmtrophy.sdat.in, sdat. tn.gov.in లలో ఆగస్టు 16వ తేదిలోపు పేర్లు నమోదు చేసుకోవాలి. వ్యక్తిగత విభాగంలో ప్రథమ బహుమతిగా రూ. లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75,000, తృతీ య బహుమతిగా రూ.50,000, గ్రూపు విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.75,000, ద్వితీయ బహుమతిగా రూ.50,000, తృతీయ బహుమతిగా రూ.25,000 అందించనున్నారు.

చెన్నై-అరక్కోణం మధ్య ఏసీ సబర్బన్ రైలు

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య తొలి ఏసీ సబర్బన్ రైలు సేవలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో, త్వరలో చెన్నై-అరక్కోణం మధ్య రెండో ఏసీ సబర్బన్ రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. చెన్నై బీచ్- తాంబరం-చెంగల్పట్టు మధ్య నడుపుతున్న ఏసీసబర్బన్ రైలుకు ప్రయాణికుల ఆదరణ పెరిగింది. ప్రస్తుతం, స్థానిక ఐసిఎఫ్‌లో రెండవ ఏసీ సబర్బన్ రైలు తయారీ తుది దశకు చేరుకుంది. ఈ రైలును వచ్చే నెలాఖరులో మూర్ మార్కెట్ కాంప్లెక్స్-అరక్కోణం మధ్య నడిపే అవకాశముందని అధికారులు తెలిపారు.

25న పాఠశాల నిర్వహణ కమిటీల సమావేశం

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 25న పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశాలు నిర్వహించాలని పాఠశాల విద్య రాష్ట్ర పథక డైరెక్టర్ ఆర్తీ ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలల్లో జరుగుతున్న విద్యాబోధన, వసతుల కల్పన తదితరాలు సమీక్షించేందుకు ప్రతినెలా పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ప్రస్తుత విద్యా సంవత్సరం తొలి పాఠశాల నిర్వహణ కమిటీల సమావేశం ఈనెల 25న మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4.30గంటలకు వరకు నిర్వహించాలని, సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలను 'నమ్మ స్కూల్ నమ్మ ఊరు పళ్లి' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు.

పెరంబూర్-అంబత్తూర్ మధ్య కొత్త రైలు మార్గాలు

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్ - అంబత్తూర్ మధ్య రూ.182 కోట్ల వ్యయంతో కొత్త రైలు మార్గాలకు రైల్వే బోర్డు అనుమతులు ఇచ్చిందని దక్షిణ రైల్వే తెలిపింది. ప్రస్తుతం ఈ మార్గంలో నాలుగు మార్గాలు ఉండగా, సబర్బన్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నారు. రైళ్ల సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టిన దక్షిణ రైల్వే, ఈ మార్గంలో 5,6 మార్గాల ఏరాటుకు అనుమతులు కోరుతూ రైల్వే బోర్డుకు దరఖాస్తు సమర్పించింది. ప్రస్తుతం కొత్త మార్గాల ఏర్పాటుకు రైల్వే బోర్డు అనుమతించిందని, పెరంబూర్-అంబత్తూర్ మధ్య రూ.182 కోట్లతో ఫ్లై ఓవర్లు, సబ్‌వేలతో 6.4 కి.మీ కొత్త మార్గాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

లంచం తీసుకున్న ఎస్ఐ అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేసు నుంచి తప్పించేందుకు లంచం ఆశించిన ఎస్ఐ కటకటాలపాలయ్యాడు. కారైక్కాల్ జిల్లా తేనూరుకి చెందిన మణికంఠన్‌ను కేసు నుంచి తప్పించేందుకు తిరునల్లారు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పక్కిరిస్వామి రూ.5,000 లంచం ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దీంతో, మణికంఠన్ చెన్నై సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సీబీఐ డీఎస్పీ జగదీశన్ నేతృత్వంలో ఆరుగురు అధికారులు శుక్రవారం తిరునల్లారు చేరుకుని, రసాయనాలు పూసిన రూ.5 వేల కరెన్సీ నోట్లను మణికంఠన్‌కు అందజేశారు. పక్కిరిస్వామి తెలిపిన ప్రకారం తిరునల్లారు నలన్‌కుళం ప్రాంతంలో మణికంఠన్ చేరుకుని, నగదు అందిస్తుండగా, అక్కడే మాటువేసిన సీబీఐ అధికారులు అతన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు.

అత్యాచార నిందితుడి అరెస్టు ఎప్పుడో?

● ఆరంబాక్కంలో అన్నాడీఎంకే రాస్తారోకో


రాస్తారోకోలో నినాదాలు చేస్తున్న అన్నాడీఎంకే నాయకులు

ప్యారీస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి పరారైన కామాంధుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ పాఠశాల ముగించుకుని ఇంటికి వెళుతున్న బాలికపై కామాంధుడు అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడు. చిన్నారిని ఆమె తల్లిదండ్రులు బాలికను ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. 8 రోజులైనా అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేయని ఆరంబాక్కం పోలీసుల వైఖరిని ఖండిస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆ పార్టీ మత్స్యకారుల విభాగం రాష్ట్ర ఉపకార్యదర్శి జె.సురేష్, టీసీ మహేంద్రన్, గోపాల్‌నాయుడు, తిరువళ్లూరు జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి బలరామన్, మాజీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరంబాక్కం బజారు నుంచి ర్యాలీగా బయలుదేరి, పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. అయితే అక్కడ భద్రతా విధుల్లో పాల్గొన్న పోలీసులు ఆందోళనకారులను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. 300 మందికి పైగా మహిళలు, 200 మందికి పైగా అన్నాడీఎంకే కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించడంతో చెన్నై-కోల్‌కాతా జాతీయ రహదారిలోగంటపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అదనపు కట్నం కేసులో కానిస్టేబుల్ అరెస్ట్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తంగప్రియ, కానిస్టేబుల్ భూపాలన్

ప్యారీస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను చిత్రహింసల పాల్జేసిన వ్యవహారంలో మదురైకు చెందిన కానిస్టేబుల్ భూపాలన్(38)ను పోలీసులు అరెస్టు చేశారు. మదురై అప్పన్ తిరుపతి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భూపాలన్ ఓ ప్రైవేటు పాఠశాల టీచర్ తంగప్రియ(32) వివాహం గత 2018లో జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వివాహం అనంతరం అదనంగా కట్నం డిమాండ్ చేస్తూ తంగప్రియను భూపాలన్ కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఇటీవల భార్యాభర్తల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. భూపాలన్ దాడికి గురైన తంగప్రియ ప్రస్తుతం మదురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతుంది. తంగప్రియ కుటుంబసభ్యుల ఫిర్యాదు ఆధారంగా భూపాలన్, విరుదునగర్ జిల్లా సాత్తూరులో ట్రాఫిక్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అతని తండ్రి సెంథిల్‌కుమరన్, తల్లి విజయ, సోదరి అనితపై పోలీసులు వరకట్నం వేధింపు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో, మదురై సర్కిల్ పోలీసు విభాగం ఏడీజీపీ అభినవ్‌కుమార్, భూపాలన్, సెంథిల్‌కుమరన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈక్రమంలో అజ్ఞాతంలోకి జారుకున్న భూపాలన్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచి అనంతరం రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మిగతా ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

నగ్నంగా మహిళ మృతదేహం

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోయంబేడు మన్నడి వీధిలో ఓ ఇంట్లో మహిళ నగ్నంగా విగత జీవిగా పడి ఉండగా స్థానికులు గమనించి దిగ్భ్రాంతి చెందారు. ధనలక్ష్మి (50) మన్నడి వీధిలో అద్దె ఇంటిలో నివసిస్తోంది. ప్యారీస్ కార్నర్‌లో రోజూ పూల వ్యాపారం చేస్తుండేది. కొద్ది రోజుల క్రితం రోడ్డులో నడిచివెళ్తుండగా కాలుజరి పడింది. తీవ్రమైన గాయాలతో ఇంటి దగ్గరే చికిత్సలు పొందుతూ వచ్చింది. గత రెండు రోజులుగా ఇంటి నుంచి ఎలాంటి అలికిడి వినిపించక పోవడంతో చుట్టుపక్కల వారు తలుపులను తెరచి ల చూశారు. పడకగదిలో వంటిపై దుస్తులేవీ లేకుండా నగ్నంగా ధనలక్ష్మి శవమై పడి ఉండటం చూసి కోయంబేడు బస్‌స్టేషన్ పోలీసులుకు సమాచారం అందించారు. పోలీసులు ధనలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ధనలక్ష్మి మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఈపీఎస్‌ను ఎవరో మాట్లాడిస్తున్నారు?

● డీపీఐ అధినేత తిరుమావళవన్

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎడప్పాడి పళనిస్వామి తనకు తానుగా మాట్లాడడం లేదని, ఎవరో అతని వెనుక ఉండి మాట్లాడిస్తున్నారని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ వ్యాఖ్యానించారు. నగరంలో శనివారం మీడియా సమావేశంలో తిరుమావళవన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పళనిస్వామి పర్యటన కార్యాచరణ ప్రణాళిక ఎవరు ఇచ్చారో అర్థం కావడం లేదన్నారు. ఆయన తన ప్రచారంలో ప్రజల సమస్యల ప్రస్తావన కంటే డీఎంకే కూటమిలోని పార్టీలను లక్ష్యంగా చేసుకుని ప్రసంగిస్తున్నారన్నారు. డీఎంకే కూటమి పార్టీలను ఆహ్వానించడం, ఆ పార్టీలను విమర్శించడం తదితరాలతోనే ఆయన ప్రసంగం సాగుతోందన్నారు. ఇది సాధారణ ప్రజలకు కూడా అర్థమవుతోందన్నారు. ఆయనను ఎవరు నడిపిస్తున్నారు అనే విషయం ప్రజలకు తెలుసని, అధికారం చేపట్టాలనే ఆ పార్టీ కూటమి కలలు నెరవేరే అవకాశం లేదని తిరుమా స్పష్టం చేశారు.

● కన్నియమూర్ పాఠశాల ధ్వంసం కేసు

విచారణకు 306 మంది హాజరు

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కన్నియమూర్ పాఠశాల ధ్వంసం కేసుకు సంబంధించి కళ్లకుర్చి న్యాయస్థానంలో 306 మంది శనివారం హాజరయ్యారు. కళ్లకుర్చి సమీపంలో కన్నియమూరులో ఓ ప్రైవేటు పాఠశాల ప్రాంగణంలో 2022 జూలై 13వ తేది ప్లస్‌టూ విద్యార్థిని శ్రీమతి అనుమానాస్పదంగా మృతిచెందింది. ఈ ఘటన అనంతరం మృతురాలి బంధువులు, పలు ప్రజా సంఘాలు జూలై 17న పాఠశాల ముట్టడించారు. ఆ సమయంలో డీఐజీ ప్రవీణ్‌కుమార్ అభినవ్‌పై దాడి చేయడంతో పాటు ఎస్పీ వాహనం, పోలీసు వాహనాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. అలాగే, పాఠశాల ప్రాంగణంలోని వస్తువులు ధ్వంసం చేయడంతో పాటు నిప్పు పెట్టారు. ఈ ఘటనకు సంబంధించి 53 మంది చిన్నారులు సహా 916 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు, 500 మందిని అరెస్ట్ చేశారు. పాఠశాల విద్యార్థిని మృతి కేసు సీబీసీఐడీ విచారణ చేపట్టిన నేపథ్యంలో, పాఠశాల ధ్వంసం, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం తదితరాలకు సంబంధించిన కేసులు ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తోంది. ఈ కేసులో 43 మంది చిన్నారులు ఉండడంతో, వారిపై విల్లుపురంలోని బాలబాలికల విచారణ కోర్టు విచారిస్తోంది. ఈ నేపథ్యంలో, ఈ కేసు విచారణకు నేరారోపణలు ఎదుర్కొంటున్న 306 మంది కళ్లకుర్చి కోర్టుకు హాజరయ్యారు. కేసు విచారించిన న్యాయమూర్తి, తదుపరి విచారణ సెప్టెంబరు 19వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో ముగిసిన ఏసీబీ తనిఖీలు

వాషర్‌మెన్‌పేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే సత్య పన్నీర్‌సెల్వం ఇంట్లో చేపట్టిన ఏసీబీ తనిఖీలు 17 గంటలు కొనసాగాయి. కడలూరు జిల్లా బన్రూటి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం అన్నాడీఎంకే మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా వ్యవహరిస్తున్న సత్య పన్నీర్‌సెల్వం, 2016లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు, ఆమె భర్త బన్రూటి నగర పంచాయతీ అధ్యక్షుడిగా వ్యవహరించిన పన్నీర్‌సెల్వం హయాంలో కూడా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు ఫిర్యాదులు అందాయి. దీంతో, ఏసీబీ డీఎస్పీ సత్యరాజ్ నేతృత్వంలో 15 మంది అధికారుల బృందం సత్య పన్నీర్‌సెల్వం ఇంట్లో శుక్రవారం ఉదయం 7 గంటలకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. 17 గంటలు సాగిన ఈ తనిఖీలు రాత్రి 11 గంటల వరకు సాగింది. విచారణలో సమయంలో సత్య పన్నీర్‌సెల్వం హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. దీంతో, అధికారులు బన్రూటి ప్రభుత్వాసుపత్రి వైద్యులను రప్పించారు. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లాలనే వైద్యుల సిఫారసుతో కడలూరుకు తీసుకెళ్లిన ఏసీబీ అధికారులు, ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ తనిఖీల్లో కూడబెట్టిన ఆస్తులకు సంబంధించి పలు కీలక దస్తావేజులు అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

సీబీఐ అధికారుల విచారణ

వాషర్‌మెన్‌పేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుభవనం పోలీస్ స్టేషన్‌లో సీబీఐ అధికారులు విచారణ చేపట్టారు. శివగంగ జిల్లా మడపుప్పం ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్‌ను నగల చోరీ కేసులో పోలీసులు విచారణకు తీసుకెళ్లిన సమయంలో అతను ఊహించని విధంగా అస్వస్థతకు గురై మృతి చెందాడు. విచారణ పేరుతో పోలీసులు అజిత్‌కుమార్ తీవ్రంగా కొట్టడంతో ఆయన మృతి చెందాడని బంధువులు ఆరోపించగా, పోస్టుమార్టం నివేదికలో కూడా ఈ విషయం స్పష్టమైంది. ఈ వ్యవహారంలో కన్నన్, ప్రభు, ఆనంద్, రాజా, శంకర మణికంఠన్ తదితర ఐదుగురు కానిస్టేబుళ్లను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ సీబీఐకి మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో, శనివారం ఉదయం ఆరుగురు అధికారుల సీబీఐ బృందం తిరుభువనం పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ అజిత్‌కుమార్ తమ్ముడు నవీన్‌కుమార్, స్నేహితులు అరుణ్, వినోద్, ప్రవీణ్ తదితర నలుగురిని సీబీఐ డీఎస్పీ మోహిత్‌కుమార్ విచారించారు.

పార్ట్‌టైం టీచర్ల వినతుల్ని పరిశీలిస్తున్నాం

● మంత్రి అన్బిల్ మహేష్

ప్యారీస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైం టీచర్ల వినతుల్ని పరిశీలించి త్వరలో మంచి నిర్ణయం తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పార్ట్‌టైం టీచర్లు తమ డిమాండ్ల సాధన కోసం నుంగంబాక్కంలో చేపట్టిన ఆందోళన శనివారం 12వ రోజుకు చేరుకుంది. దీనిపై స్పందించిన మంత్రి అన్బిల్ పార్ట్‌టైం టీచర్ల సంఘం తరుపున కొంత మంది ప్రతినిధులు పాఠశాల విద్యాశాఖ అధికారులను సంప్రదించి వినతిపత్రాలను సమర్పించారని తెలిపారు.

'తీవ్ర మనోవేదన కలిగించింది'

● ఎక్సైజ్ డీఎస్పీ సుందరేశన్

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తన సంజాయిషీ తెలుసుకోకుండా సస్పెండ్ చేయడం తీవ్ర మనోవేదనకు గురిచేసిందని మైలాడుదురై ఎక్సైజ్ డీఎస్పీ సుందరేశన్ తెలిపారు. మైలాడుదురైలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనపై లైంగిక వేధింపులకు సహా పలు ఆరోపణలు చేస్తున్నారన్నారు. అలా తాను తప్పు చేసిన పక్షంలో సస్పెండ్ చేయాల్సి ఉందని, కానీ అలా చేయకుండా బదిలీ చేశారన్నారు. ఒకరు నచ్చలేదంటే అతను చేసే ప్రతి పనిని తప్పుపడుతుంటారని, ప్రస్తుతం పోలీసు శాఖలో ఆ పరిస్థితి నెలకొందన్నారు. యేటా వేతనం పెంపు ఉంటుందని, కానీ నా 9వ వేతన పెంపు అడ్డుకున్నారని తెలిపారు. తనకు విచారించకుండానే డీఐజీ సస్పెండ్‌కు సిఫారసు చేయడం బాధాకరమన్నారు. డీజీపీ కూడా ఇప్పటివరకు తనను విచారించలేదన్నారు. ఈ విషయం తెలిసి చెన్నైలో ఉన్న తన తండ్రికి గుండెపోటు వచ్చిందన్నారు. ఈ వ్యవహారంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారించాలని డీఎస్పీ సుందరేశన్ విజ్ఞప్తి చేశారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు



పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆడి నెల తొలి శుక్రవారం రోజున అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, అరియలూరులోని పెరియ నాయగి అమ్మవారు కరెన్సీ నోట్ల అలంకరణ భక్తులకు దర్శనమిచ్చారు. రూ.50 నుంచి రూ.500 నోట్లు వినియోగించారు. రూ.5 లక్షల కరెన్సీ నోట్ల అలంకరణ దర్శనమిచ్చిన అమ్మవారిని వీక్షించి భక్తులు పులకించిపోయారు.

ప్రజా సంక్షేమమే డీఎంకే లక్ష్యం

● ఎమ్మెల్యే ఎస్.చంద్రన్


గృహ ప్రవేశం చేసిన ప్రజలతో ఎమ్మెల్యే ఎస్.చంద్రన్

తిరుత్తణి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట సమీపంలోని వీరమంగళం పంచాయతీ పరిధిలోని గిరిజన ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తూ శనివారం ఉదయం ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ఆధ్వర్యంలో గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే చంద్రన్ శుభాకాంక్షలు తెలిపి, ఇంటి తాళాలను అందజేశారు. గిరిజనుల సొంతింటి కలను నెరవేర్చడానికి 11,947 ఇళ్ల నిర్మాణ పనులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. అదేవిధంగా ఆర్కేపేటలోని వీరమంగళం గిరిజన కాలనీకి చెందిన 15 కుటుంబాలకు రూ.76.05లక్షలతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రప్రభుత్వం ఈ ఇళ్లను నిర్మించిందన్నారు. తిరుత్తిణి బ్లాక్ డెవలెప్మెంట్ అధికారి కలైసెల్వీ, ఆర్కేపేట కార్యదర్శులు మురుగన్, సంపత్, మాజీ పంచాయతీ అధ్యక్షురాలు తిలగవతి రమేష్, డీఎంకే నిర్వాహకులు సిలంబు పన్నీర్‌సెల్వం, గణేష్, పురుషోత్తం, నాగప్పన్, డిల్లీ, దయాళన్ తదితరులు పాల్గొన్నారు.

తోటపాళ్యంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరం

వేలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తోటపాళ్యంలో శనివారం 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరం జరిగింది. ఎట్టియమ్మన్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన శిబిరంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లాలో ఈ శిబిరాలు ఈ నెల 22న ప్రారంభం కాగా 26వ తేది వరకు నిర్వహించనున్నామన్నారు. శిబిరంలో కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, 2వ మండల కమిటీ అధ్యక్షుడు నరేంద్రన్, కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మణన్, ప్రత్యేక సబ్ కలెక్టర్ కలియమూర్తి, జిల్లా తహసీల్దార్ వడివేలు, కౌన్సిలర్లు మురుగన్, ధర్మాంబాళ్, అధికారులు పాల్గొన్నారు.


వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

తిరువిక నగర్‌లో పీహెచ్‌సీ, స్కూలుకు శంకుస్థాపన


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని తిరువికనగర్ జోన్‌లో రూ.11.77 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), స్కూలు నిర్మాణ పనులకు సీఎండీఏ ఇన్‌చార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు శంకుస్థాపన చేశారు. కూక్స్ రోడ్డు వాడియా నగర్‌లో రూ.305. కోట్లతో, 75వ వార్డు నమ్మాళ్వార్‌పేట రెండో వీధిలో రూ.2.28 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. ఇదే విధంగా 73వ వార్డు పుళియంతోపు అమ్మయాళ్ వీధిలో రూ.6.44 కోట్లతో నిర్మించనున్న చెన్నై మహోన్నత పాఠశాల భవనానికి కూడా శంకుస్థాపన జరిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఆర్. ప్రియ, తిరువికనగర్ శాసనసభ్యుడు తాయగం కవి తదితరులు పాల్గొన్నారు.

రూ.6.33 కోట్లతో మున్సిపాలిటీ భవనాలకు భూమిపూజ


భూమిపూజలో మంత్రి నాజర్, ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్, కలెక్టర్ ప్రతాప్ తదితరులు

తిరుత్తణి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు నగర అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వ కార్యాలయాలకు శనివారం ఉదయం రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎస్.ఎం. నాజర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సకాలంలో ప్రజా సమస్యలను తీర్చేలా నగర పరిపాలన కార్యాలయాల ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం ముందుందన్నారు. తిరువళ్లూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల కొరత ఉందని గ్రహించిన ప్రభుత్వం, దీని కోసం రూ.6.33 కోట్లను కేటాయించిందన్నారు. ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్, కలెక్టర్ ప్రతాప్ సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'ఉంగళుడన్ స్టాలిన్'


కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ తదితరులు

తిరుత్తణి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరులోని 1వ వార్డులో నిర్వహించిన 'ఉంగళుడన్ స్టాలిన్' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలు వినతిపత్రం సమర్పించిన 45 రోజుల్లోగా సమస్య పరిష్కారం చూపుతామని తెలిపారు. ఎవరు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా మళ్లీ డీఎంకేదే అధికారమన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలను ఆయన స్వీకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఉదయమలర్, కౌన్సిలర్లు అరుణకృష్ణ, వసంతి, జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఆర్డీవో రవిచంద్రన్, మున్సిపల్ కమిషనర్ దామోదరన్, తహసీల్దార్ రజినీకాంత్, డీజీ దినేష్, ఆర్‌పీ సుకన్య, గ్రామాధికారులు శేఖర్, భారతి, కుమరేశన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పళ్లిపట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా లోకనాథుడు


నూతన కమిటీ సభ్యులతో లయన్స్ క్లబ్ నిర్వాహకులు

తిరుత్తణి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-324హెచ్ నూతన అధ్యక్షుడిగా ఏడీ లోకనాథుడు ఎంపికయ్యారు. 20యేళ్ళుగా లయన్స్ క్లబ్‌కు సేవలందించిన నేపథ్యంలో, శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో క్లబ్ సభ్యులు ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా కార్యదర్శిగా సీ.ఎం.పార్థీవ చెట్టి, ట్రెజరర్‌గా బీ.వీ.లలిత్‌కుమార్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్లుగా కె.ఈశ్వరప్రసాద్, కే.సీ.విజయ్‌కుమార్, టి.కుశల్ చంద్ మెహతా, టీ.ఎస్.ఎం.గురుమూర్తి, వి.అయ్యప్పన్, ఎన్.జనార్ధనం, ఎం.బాలన్, ఆర్.సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు.

200 మంది ఉపాధ్యాయుల అరెస్టు


ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

వేలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానం అమలు, కేంద్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు సమానంగా వేతనాలు సహా 10 డిమాండ్లతో ఆందోళన చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేశారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలో జరిగిన ఆందోళన సంఘం ఉపాధ్యక్షుడు రంజన్ అధ్యక్షత వహించగా, టెక్నికల్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనార్ధనన్ ఆందోళన ప్రారంభించారు. ఉపాధ్యాయులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టడంతో 200 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

బస్సు సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బస్సు సేవలు మెరుగుపరిచేలా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రోడ్డు రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) నిర్ణయించింది. ఈ మేరకు ఎస్ఈటీసీ విడుదల చేసిన ప్రకటనలో... ప్రజల సౌకర్యార్థం ప్రతిరోజు 2,500 పైగా బస్సులు వివిధ మార్గాల్లో నడుపుతున్నామన్నారు. బస్సు సేవలు మెరుగుపరిచేలా, మరిన్ని మార్గాలకు విస్తరించేలా ప్రజలు https://www.tnstc.in లో తమ అభిప్రాయాలు తెలుపవచ్చని ఎస్ఈటీసీ తెలియజేసింది.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వక్షోజ క్యాన్సర్ పరీక్షల కోసం వాహనం


రూ.5వేల చెక్కును అందజేస్తున్న లయన్ రవిశంకర్

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వక్షోజ క్యాన్సర్ పరీక్షల కోసం ప్రత్యేక వాహనం కొనేందుకు సంస్థ నిర్వాహకులు సంకల్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్‌సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభలో ఆ వాహనం కొనేందుకు దాతల నుండి విరాళాలను సేకరించారు. ఆ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్‌సిటీ తరఫున సంస్థ అధ్యక్షుడు లయన్ రవిశంకర్, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ అధ్యక్షుడు లయన్ ఎస్వీ మాణిక్యంకు రూ.5వేల చెక్కును అందించారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ పీఎన్ ఉదయసూర్యన్, జోనల్ అధ్యక్షుడు లయన్ ఎస్కే. దనశేఖరన్, ప్రాంతీయ అధ్యక్షుడు ఎ. ఆంటోని తదితరులు పాల్గొన్నారు.



స్కూలులో పండించిన కూరగాయలను శుభ్రం చేస్తున్న సిబ్బంది



విద్యార్థుల కోసం కోడిగుడ్లను ఉడకపెడుతున్న సిబ్బంది



గార్డెనింగ్ పనుల్లో విద్యార్థులు



స్కూలులోని బయోగ్యాస్ ప్లాంట్

కూరగాయల వ్యర్థాలతో బయోగ్యాస్ ప్లాంట్

- రూఫ్‌టాప్ గార్డెన్‌లో కూరగాయల పెంపకం
- ఆదర్శంగా నిలిచిన అడయార్ కార్పొరేషన్ స్కూలు



బయోగ్లాస్ ప్లాంట్ పనితీరు గురించి చిన్నారులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు



ఆహార వ్యర్థాలను ఓ పాత్రలో పోస్తున్న విద్యార్థులు

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్‌లోని కార్పొరేషన్ పాఠశాల, ప్రైవేటు కంపెనీ భాగస్వామ్యంతో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తోంది. ఆ స్కూలు పరిసరాల్లోని ఆహార, కూరగాయల వ్యర్థాలను ఉపయోగించి ఈ గ్యాస్‌ను ఉత్పత్తి చేయడంలో విద్యార్థులు భాగస్వాములవుతున్నారు. ఈ ప్రయత్నానికి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. చెన్నై కార్పొరేషన్, అడయార్ కస్తూర్బానగర్ నివాసుల సంక్షేమ సంఘం, ఈఎఫ్ఐ, సీఆర్‌సి సంస్థలు సంయుక్తంగా అడయార్‌లోని 65 యేళ్లనాటి చెన్నై (కార్పొరేషన్) హైస్కూలులో బయోగ్యాస్ ప్లాంట్‌ను నెలకొల్పారు. ఆ స్కూలులో 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూలు ప్రాంగణంలో పడే ఆహార పదార్థాలు, కూరగాయల వ్యర్థాలతో బయోగ్యాస్‌ను తయారు చేస్తున్నారు. ప్రతిరోజూ ఆ స్కూలు ప్రాంగణంలో లభించే 75 కిలో వ్యర్థాల ద్వారా 3 కిలోల బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. దీనితో ఆ స్కూలులో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ వాడకం క్రమంగా తగ్గింది. ఈ బయోగ్యాస్ ప్లాంట్ గత నాలుగు నెలలుగా సమర్థవంతంగా పనిచేస్తోంది. ఆ స్కూలులో రూఫ్‌టాప్ గార్డెన్ కూడా ఉంది. ఆ గార్డెన్‌లో విద్యార్థులకు భోజనంతోపాటు అందించటానికి కూరగాయలను కూడా పండిస్తున్నారు. ఈ విషయమై కస్తూర్బా నగర్ నివాసుల సంక్షేమ సంఘం కార్యదర్శి జనని వెంకటేష్ మాట్లాడుతూ ప్రతిరోజూ స్కూలులో సేకరించే వ్యర్థాలను రీసైక్లింగ్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మూడేళ్లుగా ఆ స్కూలుతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నామని, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించడమే కాకుండా కూరగాయల గార్డెన్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు సహకరించామన్నారు. ఆ తర్వాత గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ సహకారంతో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. స్కూలులో పడే ఆహార, కాయగూరల వ్యర్థాలను ఎలా వేర్వేరు చేయాలో స్కూలు సిబ్బందికి శిక్షణ కూడా అందించామన్నారు. బయోగ్యాస్ ప్లాంట్ ద్వారా ఎలా బయోగ్యాస్ ఉత్పత్తి అవుతుందో చక్కగా వివరించే గలిగే స్థాయికి విద్యార్థి సాయిచరణ్ చేరుకున్నాడు. ఆహార, కాయగూరల వ్యర్థాలను తొలుత గ్రైండింగ్ మెషిన్‌లో వేయాలని, అందులో బాగా గ్రైండింగ్ అయిన తర్వాత ఆ ద్రవాలన్నీ ద్రవరూపంలో ఉన్న పశువుల పేడతో కలుపుతారు. వ్యర్థాలు పేడ కలిసి బాగా గ్రైండింగ్ అయిన తర్వాత బయోగ్యాస్ విడుదలవుతుందని వివరించాడు. మరో విద్యార్థి తమ పాఠశాలపై రూఫ్‌టాప్ గార్డెన్ కూడా ఉందని, టమోటాలు, బీన్స్, వంకాయలు పండిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ కుమార గురుబరన్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ స్కూళ్లలో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు బయోగ్యాస్ ఎలా ఉత్పత్తి అవుతుందనే విషయంపై అవగాహన కలుగుతుందన్నారు. త్వరలో మరిన్ని పాఠశాలలకు ఈ పథకాన్ని విస్తరింపజేయనున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ ఇప్పటికే చెట్‌పట్, మాధవరం ప్రాంతాల్లో రెండు భారీ స్థాయి బయోగ్యాస్ ప్లాంట్లను కూడా నడుపుతోందని ఆయన వివరించారు.

చిత్రజ్యోతి

సహజ సిద్ధమైన నటనతో ప్రశంసలు



తమిళ చిత్రపరిశ్రమలోని యువ హీరోయిన్లలో భవ్య త్రిఖ ఒకరు. తన సినీ కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి ఆమె తన సహజసిద్ధమైన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ, వారి హృదయాల్లో చోటు దక్కించుకున్నారు. తాజాగా రాజు హీరోగా నటించిన 'బన్ బట్టర్ జామ్' చిత్రంలో అద్భుతంగా నటించి మంచి మార్కులు కొట్టేశారు. సినిమాల్లోనే కాకుండా, నిజ జీవితంలోనూ తనదైన శైలిలో ముందుకు సాగిపోతున్న భవ్య త్రిఖ.. నగరంలోని ఎంవోపీ వైష్ణవి కాలేజీ పూర్వ విద్యార్థిని. మీడియా విభాగంలో పట్టభద్రురాలైన భవ్య.. 2022లో దినేష్ పళనివేల్ దర్శకత్వంలో వచ్చిన 'కదిర్' అనే మూవీ ద్వారా వెండితెర ప్రవేశం చేశారు. ఆ తర్వాత 2023లో రియో రాజ్ జంటగా 'జో' మూవీలో 'శ్రుతి' అనే పాత్రలో నటించి, ప్రేక్షకుల మనసుల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్నారు. తమిళనాడు, కేరళ సరిహద్దుల్లోని కాలేజీ విద్యార్థుల జీవితాలను ఇతివృత్తంగా తీసుకుని రూపొందించారు. 2023లో విడుదలైన ఈ చిత్రం ఘనవిజయం సాధించింది. ఎక్స్‌పోజింగ్‌కు దూరంగా, సంప్రదాయ దుస్తుల్లో కనిపించే భవ్య త్రిఖ.. తన నటనా ప్రతిభను నిరూపించుకునే పాత్రల కోసం ఎదురుచూస్తోంది. సహజత్వానికి, వాస్తవిక జీవితానికి దగ్గరగా ఉండే పాత్రలు చేయాలన్నదే తన బలమైన కోరిక అని ఆమె అంటున్నారు.

'మిస్టర్ భరత్' చిత్రీకరణ పూర్తి



'మిస్టర్ భరత్' చిత్ర బృందం

యంగ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ సమర్పణలో ప్యాషన్ స్టూడియోస్, జి స్క్వాడ్, ది రూట్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన 'మిస్టర్ భరత్' సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. యూట్యూబ్ సెన్సేషనల్ ఐకాన్ భరత్ - సంయుక్త విశ్వనాథన్ జంటగా నటించిన ఈ చిత్రానికి నిరంజన్ దర్శకత్వం వహించారు. ఇతర పాత్రల్లో బాల శరవణన్, నిధి ప్రదీప్, ఆర్.సుందర్ రాజన్, లింగా, ఆదిత్య కదిర్ తదితరులు పోషించారు. దివాకర్ డెన్నిస్ కెమెరామన్‌గా పనిచేయగా, ప్రణవ్ మునిరాజ్ సంగీత స్వరాలు సమకూర్చారు. ఈ సినిమా వివరాలను ప్యాషన్ స్టూడియోస్ అధినేత సుధన్ సుందరం వెల్లడిస్తూ.. 'ఈ చిత్రం కోసం పనిచేసిన వారంతా యువకులే. ఇలాంటి ప్రతిభావంతులైన నటీనటులు, టెక్నీషియన్లతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. వారి అంకితభావం చూసి ఆశ్చర్యపోయాం. ఒక ప్రణాళికతో అనుకున్న సమయానికి చిత్రీకరణ పనులు పూర్తి చేశారు. ప్రతి ఒక్కరూ చక్కటి సమన్వయంతో ఎంతగానో శ్రమించారు. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు పూర్తి చేసి వీలైనంత త్వరగా విడుదల చేస్తాం' అని పేర్కొన్నారు.

8న 'భాయ్ స్లీపర్ సెల్' రిలీజ్



'భాయ్ స్లీపర్ సెల్'లో ఓ దృశ్యం

డెబ్యూ డైరెక్టర్ కమలనాథన్ భువన్ కుమార్ రూపొందించిన 'భాయ్ స్లీపర్ సెల్' సినిమా ఆగస్టు 8న విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. కేఆర్ఎస్ ఫిల్మ్ డామ్ సమర్పణలో నిర్మాతలు ఆర్.కృష్ణరాజ్, శ్రీ నియా, ఆధవ్ ఈశ్వర్ సంయుక్తంగా నిర్మించారు. ఆధవ్ ఈశ్వర్ హీరోగా నటించిన ఈ చిత్రానికి కెమెరా కృష్ణమూర్తి, సంగీతం జితిన్ కె.రోషన్. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ 'ఇది నా తొలి చిత్రం. ఒక మంచి సందేశాత్మక చిత్రంగా రూపొందించాం. మతం అనేది ఒక రాజకీయ అస్త్రంగా మారింది. మతాన్ని ప్రధానాంశంగా తీసుకునే నేటి రాజకీయాలు సాగుతున్నాయి. వీటికి తోడు మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా తదితర అంశాలను టచ్ చేస్తూ, నేటి యువతకు ఒక మంచి సందేశం చిత్రంగా రూపొందించాం. వచ్చే నెల 8న విడుదల చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

రామ్ సంగయ్య దర్శకత్వంలో కవిన్



కొత్త చిత్రం పూజా దృశ్యం

'దండట్టి' వంటి విజయవంతమైన చిత్రాన్ని రూపొందించిన రామ్ సంగయ్య దర్శకత్వంలో యువ హీరో కవిన్ నటించనున్నారు. ప్రిన్స్ పొడక్షన్స్ పతాకంపై ఎస్.లక్ష్మణ్ కుమార్ నిర్మించే ఈ చిత్రానికి ప్రొడక్షన్ నెం.18 అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్‌ను త్వరలోనే ప్రారంభించనున్నారు. ఈ చిత్రంలో నటించే నటీనటుల వివరాలను, పనిచేసే సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని నిర్మాత వెల్లడించారు. ఇదిలావుండగా, కవిన్ - ప్రియాంకా అరుల్ మోహన్ జంటగా నటించే మరో కొత్త చిత్రం కూడా సంప్రదాయ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ఈ సినిమాకు కెన్ రాయ్‌సన్ దర్శకుడు. థింక్ స్టూడియోస్ నిర్మించనుంది.

గిండి రేస్‌కోర్సు మైదానంలో గ్రీన్ పార్క్ నిర్మాణానికి బ్రేక్

- గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వు



గిండి రేస్‌కోర్సు మైదానం

టి.నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి రేస్‌కోర్సు మైదానంలో గ్రీన్ పార్క్ నిర్మాణకునులపై నిషేదం విధిస్తూ గ్రీన్ ట్రిబ్యునల్ 'స్టే' ఉత్తర్వు జారీ చేసింది. వేళచ్చేరి చెరువులోకి జలాలు ప్రవేశించే కాలువ ఆక్రమణ, ఆ చెరువులో మురుగు కలవడం తదితర వ్యవహారాలపై నగరంలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సూమోటోగా కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతోంది. ఈ విషయంలో వేళచ్చేరి చెరువు సంరక్షణ ఉద్యమ సంస్థ ఉపాధ్యక్షుడు కుమారదాసన్ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా ట్రిబ్యునల్ విచారణ జరుపుతోంది. ఈ పిటిషన్ ఇదివరకే విచారణకు వచ్చినప్పుడు గిండి రేస్‌కోర్సు మైదానంలోని 118 ఎకరాల్లో కొత్త చెరువును నిర్మించవచ్చునని, అదే జరిగితే వేళచ్చేరి ప్రాంతాన్ని వరద ముప్పులనుండి కాపాడుకోవచ్చునని, అయితే 118 ఎకరాల స్థలాన్ని గ్రీన్ పార్కు నిర్మాణం కోసం రాష్ట్ర ఉద్యానవనాల శాఖకు అప్పగించింది. దీనిపై గ్రీన్ ట్రిబ్యునల్ స్పందిస్తూ రేస్‌కోర్సు మైదానంలో కొత్తగా చెరువును ఎందుకు నిర్మించకూడదో కారణాలు తెలుపుతూ నివేదికను సమర్పించచాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఉత్తర్వు వెలువరించింది. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్ న్యాయమూర్తి పుష్పా సత్యనారాయణ, నిపుణుల కమిటీ సభ్యుడు సత్యగోపాల్ తదితరుల ఎదుట మళ్లీ విచారణకు వచ్చింది. ఆ సమయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరపున ఎలాంటి నివేదిక సమర్పించలేదు. దీనితో ట్రిబ్యునల్ తీర్పు జారీ చేస్తూ గ్రీన్ పార్కు నిర్మాణం కోసం గిండి రేస్‌కోర్సు స్థలాన్ని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అప్పగించారో లేదో ఇదమిత్థంగా తెలియటం లేదని, రెవెన్యూ శాఖ ద్వారా లేదా ఉద్యానవనాల శాఖ ద్వారా ఆ స్థలాన్ని కార్పొరేషన్‌కు అప్పగించలేదని కార్పొరేషన్ తరపు న్యాయవాది చెబుతున్నారనింది. ఈ పరిస్థితులలో ట్రిబ్యునల్ గతంలో జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివేదికను సమర్పించేంతదాకా గిండి రేస్‌కోర్సు మైదానంలో గ్రీన్ పార్కు నిర్మాణ పనులను నిలిపివేయాలని స్టే విధించింది. తదుపరి విచారణను ఆగస్టు 21కి వాయిదా వేసింది.

సీనియర్ సిటిజన్లకు అమ్మవారి ఆలయాల సందర్శన భాగ్యం



ఉచిత ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభోత్సవంలో మంత్రి శేఖర్‌బాబు, ఎంపీ కళానిధి వీరాస్వామి తదితరులు

ప్యారీస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆడి మాసం సందర్భంగా సీనియర్ సిటిజన్లు అమ్మవారి ఆలయాలను సందర్శించేందుకు రాష్ట్రప్రభుత్వం తరుపున ఉచిత ఆధ్యాత్మిక యాత్ర నిర్వహించనుంది. ఈ పథకంలో చెన్నై, తంజావూరు, మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు, ఈరోడ్, తిరునల్వేలి జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన అమ్మవారి ఆలయాలకు సీనియర్ సిటిజన్లను తమిళనాడు టూరిజం డెవలెప్మెంట్ కార్పొరేషన్ (టీటీడీసీ) బస్సుల్లో ఉచితంగా తీసుకెళ్లేందుకు హిందూ దేవాదాయశాఖ ఆధ్యాత్మిక యాత్ర పథకాన్ని రూపొందించింది. ఇందులో ఈ నెల 18, 25, ఆగస్టు 1, 8, 15 తేదీల్లో 60 నుంచి 70యేళ్ల పైబడిన సీనియర్ సిటిజన్లకు అమ్మవారి ఆలయాల సందర్శన భాగ్యం కలిగింది. ఈ ఆధ్యాత్మిక యాత్రను ఆడి మాసం తొలి శుక్రవారం సందర్భంగా స్థానిక తిరువొత్తియూర్‌లోని వడివుడయమ్మన్ ఆలయం ప్రాంగణం నుంచి మంత్రి పీకే శేఖర్‌బాబు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కళానిధి వీరాస్వామి, జోన్ చైర్మన్ తమిళరసు, కాళికాంబాళ్ ఆలయ ట్రస్టీ ఈఎం మోహనాచ్చారి, దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ మంగయర్ కరిసి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్యారీస్‌లోని కాళికాంబాళ్ ఆలయం, మైలాపూర్ కర్పగమ్మాళ్ ఆలయం, తిరుర్కాడు కరుమారియమ్మన్ ఆలయం, మాంగాడులోని కామాక్షి అమ్మవారి ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సీనియర్ సిటిజన్లు పాల్గొని అమ్మవారిని సేవించారు.

పెంపుడు జంతువులకు మైక్రోచిప్

- జీసీసీ చర్యలు

ప్యారీస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జంతువులకు మైక్రోచిప్ అమర్చేందుకు స్మార్ట్‌ఫోన్ యాప్‌ను రూపొందించే చర్యలు చేపట్టినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రకటించింది. నగరంలో ఉన్న 200 వార్డుల్లో వీధికుక్కల బెడద రోజురోజుకు అధికమవుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పిచ్చికుక్కల బెడదను నివారించేందుకు, వాటివల్ల వ్యాధులు సోకకుండా అడ్డుకునేందుకు పుళియాన్‌తోప్, లాయడ్స్ కాలనీ, కన్నమ్మపేట, మీనంబాక్కం, షోళింగనల్లూరు ప్రాంతాల్లో కుటుంబ నియంత్రణ కేంద్రాలు, నుంగంబాక్కంలో పెంపుడు జంతువుల చికిత్సా కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీధికుక్కల సంతానోత్పత్తిని నివారించేందుకు మరో పది జోన్లలో రోజుకు కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స, రేబిస్ ఇంజెక్షన్లు వేసే పనులు జరుగుతున్నాయి. నగరంలో ఇటీవల జరిపిన సర్వేలో 1.80 లక్షల వీధికుక్కలున్నట్లు తెలిసింది. వీటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేసిన వివరాలు, పెంపుడు జంతువులను పోషిస్తున్న యజమానుల వివరాలు, లైసెన్సు తేదీ, రేబిస్ ఇంజెక్షన్ వేసిన తేదీ, వాటికి చికిత్సలందించిన వైద్యుల వివరాలు, ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి వాటి వివరాలతో కూడిన మైక్రోచిప్‌ను కుక్కలకు అమర్చేందుకు టెండర్లకు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న పార్ట్‌టైం ఉపాధ్యాయుల నిరసన

పెరంబూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పార్ట్‌టైం ఉపాధ్యాయులు చేపట్టిన ఆందోళన రోజురోజుకు ఉధృతమవుతోంది. శనివారంతో ఈ నిరసన 12వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో 2012లో సుమారు 12,000 మందికి పైగా పార్ట్‌టైం ఉపాధ్యాయులను నియమించారు. వారంలో మూడు రోజులు పనిచేస్తున్న వీరికి గౌరవ వేతనంగా రూ.12,500 అందజేస్తున్నారు. తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరుతూ పార్ట్‌టైం ఉపాధ్యాయులు దీర్ఘకాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. డీఎంకే అధికారం చేపడితే ఉద్యోగులు క్రమబద్ధీకరిస్తానని ఆ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కానీ, అధికారం చేపట్టి నాలుగన్నరేళ్లు గడిచినా తమ సమస్యపై స్పందించలేదంటూ పార్ట్‌టైం ఉపాధ్యయులు ఈనెల 8వ తేది నుంచి స్థానిక నుంగంబాక్కంలోని డీపీఐ కార్యాలయం సమీపంలో ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనలు శనివారం కూడా కొనసాగాయి. పలు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు అందోళనలో పాల్గొన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘం ప్రకటించింది.



మేనిఫెస్టోలోని 181 హామీలు అమలు చేయాలంటూ ప్లకార్డులతో ఉపాధ్యాయులు

తిరుచెందూరు వల్లీ గుహలో పూజలకు అనుమతి



వల్లీ గుహకు వెళుతున్న భక్తులు

ప్యారీస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరులో ప్రపంచ ప్రసిద్ధి చెందిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోని వల్లీ గుహలో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు పూర్తి కావడంతో ఆరు నెలల తర్వాత భక్తులు పూజల్లో పాల్గొనేందుకు అనుమతులు జారీ అయ్యాయి. తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ మహాకుంభాభిషేకం కోసం భారీస్థాయిలో పలు విడతలుగా చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు పూర్తయ్యాయి. ఈ నెల 7వ తేదీ అశేష భక్తజనం మధ్య మహాకుంభాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో, ఈ ఆలయ ప్రాంగణంలోవున్న వల్లీ గుహలో జీర్ణోద్ధరణ పనుల నిమిత్తం హిందూ దేవాదాయశాఖ నిధులు కేటాయించింది. ఆరు నెలల క్రితం ప్రారంభించిన ఈ పనులు ముగిసి గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయానికి వెళ్ళిన భక్తులను వల్లీ గుహ దర్శనానికి అనుమతించారు.

ఇపియాన్ ఆస్పత్రిలో మోకాలు, తుంటి, భుజాలకు ఆపరేషన్ రహిత చికిత్సలు



మీడియా సమావేశంలో పాల్గొన్న డాక్టర్ చేతనా చేతన్, డాక్టర్ సుధీర్

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా ఒంటి నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడే రోగులకు ఉపశమనం కలిగించేరీతిలో నగరంలోని 'ఇపియాన్ చెన్నై' ఆస్పత్రి ఆపరేషన్ రహిత చికిత్సలందిస్తోందని ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ సుధీర్ దారా, క్లినికల్ హెడ్ డాక్టర్ చేతనా చేతన్ తెలిపారు. ఆస్పత్రిలో ఏర్పాటైన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. మూడేళ్లలో 5 వేలమందికి పైగా రోగులకు చికిత్సలందించి నొప్పుల నుంచి విముక్తి కలిగించినట్లు పేర్కొన్నారు. మోకాలు, తుంటి, భుజాలకు శస్త్రచికిత్సలేని చికిత్సలు, కీళ్లు, స్నాయువు, వెన్నెముక నొప్పులకు ఆర్ఆర్‌పీ చికిత్సలు, దీర్ఘకాలిక నరాల, వెన్నునొప్పికి రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్, సూదిమందులతో మెరుగైన చికిత్సలందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కొత్త రోగులకు కన్సల్టేషన్ రుసుమును రూ.777కు తగ్గించినట్లు తెలిపారు.

ఉచిత అంబులెన్స్ సేవల ప్రారంభం



అంబులెన్స్ సేవలు ప్రారంభిస్తున్న కమల్

వాషర్‌మెన్‌పేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శివకాశి కమల్ హాసన్ అభిమానుల సంఘం అందజేసిన ఉచిత అంబులెన్స్ సేవలను మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమలహాసన్ ప్రారంభించారు. స్థానిక ఆళ్వార్‌పేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కమల్ హాసన్ మాట్లాడుతూ... తన అభిమానులు సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటుంటారని, ప్రస్తుతం అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లేలా ఉచిత అంబులెన్స్ సేవలు అందించడం చాలా ఆనందంగా ఉందని కమల్ తెలిపారు.